# రిజల్ట్సు

శ్రీ ఏసల శ్రీనివాసులు

—— (౦) ——

"శంకరం ఈసారైనా బాగా చదివి ప్యాసుకారా" అని పరీక్షలు కాకమునుపు నుండే మా నాన్న అంటూండేవాడు. నేను పరీక్షలు బాగా వ్రాశాను. అంటే నా మట్టుకు నేను బాగా వ్రాశానని తృప్తి పడ్డాను. శలవు లొచ్చాయి. మా చెల్లాయి, "యీసారైనా ప్యాసవుతావా? టపాసవుతావా?" అని వేళాకోళం చేస్తుంది. కడకు మా చెల్లాయికికూడా చులకనయ్యాను.

"రిజల్ట్సు రానే వచ్చాయి. పేపరులో నంబర్లు వరసగా చూస్తున్నాను. చూపు నా నంబరు పరిసరాలలోకే వచ్చింది. కానీ అది ఆ చుట్టుపక్కల ఎక్కడా కనుపించలేదు. మరలా జాగ్రత్తగా కళ్లు పెద్దవిచేసి చూశాను. ఊహూ! కను చూపుమేరలో కనుపించలేదు. నా నంబరుకు ఏదో వ్యాధి వచ్చివుంటుంది, అది ప్రస్తుతం వాల్తేరు విశ్వకళా పరిషత్తులోనే బెడ్డింగ్ తీసుకొని, నిదానంగా వస్తుందని" అనుకున్నాను.

మా నాన్న అప్పుడే కాఫీ త్రాగి వరండాలోకివచ్చి నేను పేపరు చూస్తుండడం గమనించి,

"శంకరం! ఏమిటి విశేషం! ఈ రోజు పేపరు చూస్తున్నావే? పెద్ద గాలివానా రాబోతుందిరా!" అన్నాడు.

రావటమే వ్యంగ్య ధోరణిలో వచ్చాడే పరీక్ష తప్పానన్న సంగతి తెలిస్తే యింక యెంత మండిపడతాడో! అని రిజల్ట్సు సంగతి చెబుదామా, వద్దాఅని సందిగ్ధంలో పడ్డాను. కడకు ఎలాగయినా యిప్పుడు చెప్పడమే మంచిదనుకొని, బిక్కు బిక్కుమంటూ,

"రిజల్ట్సు నాన్నా" అన్నాను.

"రిజల్ట్సా! ఏమయింది" అన్నాడు నాన్న ఆతృతగా. ఇన్నేళ్లు చదివించి, ఎంతో డబ్బు నా కొరకు వినియోగపరిచిన నాన్నకు ఆ మాత్రం ఆతృత కన్నకొడుకు ఫలితాలమీద వుంటుందని నాకు తెలుసు.

"తప్పాను! నాన్నా" అన్నాను మెల్లగా.

"తప్పావూ! అది నీకు వుగ్గుతో నేర్పిన విద్యేగా! తప్పావంటే తప్పవూ! ఇదేం పత్రికలకు కథలు వ్రాయటమనుకున్నావా! లేక స్కూలులో నాటకాలు వేయటమనుకున్నావా! ఎంత డబ్బు తగ

లేశానురా నీ కోసం! అప్రాచకపు వెధవా! తప్పాడట తప్పాడు!''

నాన్నగారికి కోపం హెచ్చింది. నా హృదయం విషాదపూరిత మయింది. ఎందుకీ బ్రతుకనిపించింది. మౌనం వహించాను.

''ఇంక నీకు చదువూ లేదు గిదువూ లేదు. పో వెధవా! నీ యిష్టంవచ్చినట్లు నాటకాలు వేసుకుంటూ వూరూర తిరుగుతూ జీవించుపో రా!'' అని మండిపడుతూ ఆవేశంతో ఆఫీసుకెళ్లాడు.

అప్పటికే నా కనుకొలకుల్లో నీళ్లు నిండాయి. నాన్నకింత కోపంవస్తుందని నేను కలలోకూడా అనుకోలేదు. అవును మరి ఒకే పరీక్షలో మూడుసార్లు తప్పానంటే కోపంరాదూ! నేనింతగా ఆరాధించినకళ నాకింత ద్రోహం చేస్తుందనుకోలేదు. నాకిది ముందుగా తెలిసివుంటే దీనిలోకి అడుగు పెట్టేవాడిని కాదు, అని అనుకున్నాను.

''నిజం! నిజం'' అన్నట్లుగా నా కన్నీటి చుక్కలు చేతిలోనున్న పేపరులో రిజల్టుమీదపడ్డాయి.

''ఏమిటి నా భవిష్యత్తు? ఏమిటి నా వర్తమానం?''అని స్వగతంగా ప్రశ్నించుకున్నాను. దానికి జవాబుగా ఆరాధించిన కళ! ప్రేరేపించిన ప్రళయం'' అని నా చేతిలోని రుమాలు నా కళ్ల నీళ్లను తుడిచింది.

ప్రళయమా? ప్రశ్న-అదే ప్రళయం! యిదే మరణం అని జవాబు హృదయంలో ఓ మారు మూల గొణిగింది. మన ప్రాచీనకవులెవరూ విద్యకూ, మరణానికీ సంబంధం కల్పించలేదు నాకు తెలిసి. విద్యకోసం మరణిస్తారా? మరణంకోసం విద్య నభ్యసిస్తారా? - ఏమిటీ పిచ్చి ప్రశ్నలు? పిచ్చి ప్రశ్నలా? కాదు. భవిష్యత్ ప్రశ్నలు. హృదయం వికలమైంది.

''నాన్నను యింతగా కష్టపెట్టిన నువ్వు యిక జీవించకూడదు. పో! ఈ లోకం నుండి! నీకు యిక్కడ స్థలంలేదు. భూభారమైనా కాస్త తగ్గుతుంది'' అని అంతరాత్మ ఘోషిస్తోంది.

అదే ఉత్తమమైన మార్గం అనుకున్నాను. సరాసరి వూరిబయటవున్న తోటలోనికివచ్చాను. అక్కడ గన్నేరు కాయలచెట్లున్నాయి. ఓపది గన్నేరు కాయలుకోశాను. వాటిని తినేశాను. పగలు పదిగంటల సమయం అప్పుడు. కడుపులోఏదో పేగులను మెలిపెట్టినట్లుగా బాధనిపించింది. సొమ్మసిలి ఆ చెట్టు కానుకునే కూర్చున్నాను.

ఆ కాయలు తినడంవల్ల శారీరకంగా బాధగావున్నా, యిక కొద్ది క్షణాలలో

మరణించబోతున్నానని తెలియగానే మానసికంగా ఏదో తెలియనటువంటి అర్ధరహితమయిన తృప్తిని పొందగలిగాను. అప్పటికే నాకు మైకం క్రమ్మింది కళ్ళు మూసుకుపోతున్నాయి.

ఇది జరిగిన నాలుగైదు గంటల తర్వాత నాకు స్మృతివచ్చింది. కళ్ళు తెరిచాను. గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. నాన్న, చెల్లాయి డాక్టరు నర్సు, వగైరాలందరూ హాస్పిటలలో నేనున్న బెడ్ చుట్టూవున్నారు దీనవదనాలతో. నా స్పృహతో డాక్టరు నాన్నకు Hopes యిచ్చాడు.

నాన్న చితికిన హృదయంతో – "శంకరం! నాయనా! నేనేదో ఉద్రేకంలో అన్నానని యిలా చేసుకుంటావుట్రా! ప్రాణాలతో చెలగాటమట్రా! మీ అమ్మ పరలోకంలో యీ విషాద ఘట్టానికి ఎంతగా దుఃఖిస్తుందో! అన్ని ఆశలూ నీ మీద పెట్టుకొని జీవిస్తున్నాను గదట్రా" అన్నాడు ఏడుపుముఖం పెట్టి. చెల్లాయి వెక్కి వెక్కి ఏడుస్తోంది.

నాన్న యింతగా పశ్చాత్తాపపడుతాడని అనుకోలేదు. ఎందుకిలా వీరిని దుఃఖపెట్టానా అని నేనే కించపడ్డాను. ఆ తోటలోనివాళ్ళు నన్నిక్కడకి చేర్చకపోతే నేనేమయివుండేవాడినో అనుకున్నాను.

ఇంతలో పోస్టుమేన్ ఓ కవరందించేడు. డాక్టరు చించిచదివాడు. అది యూనివర్సిటీ నుండి వచ్చింది. నేను ప్యాసయాననీ, పేపర్లో నా నంబరు పొరపాటున తప్పిందనీ. ఆ మాటలకు, నా ఆనందానికి మేరలేదు. నా ఆరోగ్యం పూర్తిగా వచ్చినట్లయింది. డాక్టరు "యిక మీ అబ్బాయికేంపర్వాలేదు" అని నవ్వుతూ నర్సుతో వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత కొన్ని రోజులకు స్కూలుకెళ్ళి నా రిజిస్టరు తీసుకొనివస్తున్నాను. దారిలో మా స్నేహితుడు రామం కనుపించాడు నిరుత్సాహంగా కనుపించాడు. నేను "ఏరా! దిగులుగావున్నావు" అన్నాను. రామం ప్యాసయ్యాడు, అతని విచారానికి కారణం తెలియలేదు. వాడు "ఏంలేదురా! నీ గురించే! ఈ సారైనా ప్యాసుకారా" అన్నాడు.

ఉలిక్కిపడ్డాను. "ఏమిట్రోయ్ నేను ప్యాసుకాలేదనుకుంటున్నావా మనం ప్యాసయేంరా! యూనివర్సిటీనుండి మొన్ననే లెటరొచ్చింది." రామం విస్తుపోయాడు. "ఏమిటీ! నిజంగా నువ్వు ప్యాసయ్యావా? పేపరులో నీ నంబరు కనుపించలేదేమరి" అన్నాడు.

'అవునురా! మనం స్పెషల్ గా ప్యాసయ్యాం. చూడు కావలిస్తే రిజిష్టరు' అన్నాను గర్వంగా.

[97 పేజి చూడుడు]

(88 పేజి తరువాయి)


రామం "ఏదీ! యిలాతే" అని రిజిష్టరుచూసి "ఓరీ శుంఠాయి! ప్యాసయాడుట పాసు. ఎక్కడ ప్యాసయావురా! బాగా చూశావా రిజిష్టరు" అన్నాడు. నేను విస్తుపోయాను. "అయితే మరి యూనివర్సిటీ నుండివచ్చిన లెటరు" అన్నాను ఆవేశంతో.

"ఏదీ? లెటరు" అన్నాడు రామం.

"అది డాక్టరు దగ్గఅనే! వుండిపోయింది" అన్నాను ,సంధిగ్ధావస్థలోపడి.

"బలేకోశారా నీకు మంచి లేతసొరకాయలు" అని రామం వెళ్ళాడు నవ్వుతూ.

తర్వాత తెలిసింది, ఆ రోజు డాక్టరు నా ఆరోగ్యంకోసం అలా నాటకమాడించేడని. శలవ్.




"సౌత్ ఇండియా ఆఫీసు :5/149, బ్రాడ్వే, మద్రాసు 1."